# జీవజ్వాల

–జాతశ్రీ

మా బాచిగాడా మధ్యలో ప్రేమలో పడ్డాడు!

అందుకు ప్రేరకాలూ, కారకాలూ ఏవో... పూర్తిగా నాకు తెలీవు కాని, ఆ నోరూ, ఈ నోరూ చిలకల్లా వల్లించిన పలుకుల్ని బట్టి – వాడి ప్రేమకు సాహిత్యం కాస్త సహకరించిందనీ, మిగతా భాగాన్ని వాడి వయసూ, టి.వి. చానల్సూ కలిసి భర్తీ చేశాయని గ్రహించాను.

ప్రేమలో పడ్డవాడు ఏమవుతాడో ఎవరికి తెలీదు?

ఎంతగా ఏమైపోవాలో అంతదాకా పోయేడు. ప్రేమ సంగమానికి పయనించే అన్ని మార్గాల్లో వేలు పెట్టి, అదికాస్తా కాలేక, ఆఖరి మార్గంగా సాహితీ మార్గంలోకి దూకి కథా వీధిలో కాలుపెట్టాడు.

కాలు పెట్టక ముందు– ఒకటీ, రెండుసార్లు ఆలోచిస్తే బావుండేది. ఆ తర్వాత కూడా వాడా పని చేయకుండా ప్రేమకథా – తేనెపట్టులను జుర్రుకోవడం ఆరంభించాడు. అంతటితో ఆగినా బాగుండేది. ఆగలె! తానే ఆ రకమైన తేనె పట్టులను సృష్టించసాగాడు. పిట్టకథలూ, కాకమ్మకథలూ, కాశీ మజిలీ కథలూ, పేదరాశి పెద్దమ్మ కథలూ, సాలభంజిక కథలూ వగయిరా... కంచికి చేరిన కథల రీతిలో, నీతిలో – తానూ కథలు రాయడం ఆరంభించాడు. వాటి ఇతివృత్తాలు మటుకు, అధునాతనమైనవీ, అభినందించదగినవీ అని ఆ నోళ్లే చెప్పాయి.

"నిజమేనా?"

బాచి తలూపి, తప్పును ఒప్పేసుకొన్నాడు. (గమ్మత్తేమిటంటే – బాచి తప్పును తప్పనుకోవడం లేదు. పైగా కథలపై కమ్మని అభిప్రాయమూ వ్యక్తీకరించాడు)

"నువ్ పూర్తిగా చెడిపోయావురా..."

"అది మీ అభిప్రాయం!"

"నోర్ముయ్, వెధవ... ఎంచక్కా సాఫ్ట్‌వేర్ చదువు కొని అమెరికాలో ఏ బిల్‌గేట్స్ నీడనో బతకాల్సిన వాడివి, నీకిదేం ఖర్మరా? అంతగా 'రచనా – వ్యసనం' ఉంటే... నాలుగు వ్యక్తిత్వ వికాస పుస్తకాలు చదివి, మరో రెండు రాస్తే నాలుగు రూకలయినా వస్తాయి. అది మానేసి, ఇదట్రా నీ వ్యాపకం? అదోరకం కోపం, బాధా కలగలిసిన స్వరంతో అన్నాను.

"ఏ వ్యాపకం?"

"సిగ్గులేక యింకా అడుగుతున్నావా?... అదే, కథలు... కథలు రాస్తున్నావటగా? ఏదీ తమరి కథా సంవిధానాన్ని చదివి తరిస్తాం.. ఓ కథటు పడేయండి' అన్నాను.

నా స్వరంలోని వ్యంగ్యానికి వాడేం నొచ్చుకున్నట్టు లేదు. శాశ్వతంగా, నిరాపేక్షంగా ఉండే సత్యాన్ని గూర్చి అధ్యయనం చేసిన భావవాదిలా నొసలు చిట్లించి, మౌనంగా నడిచి, తన రాత ప్రతుల దొంతరలోంచి ఓ కథ తీసి ఇచ్చాడు.

వాడిచ్చిన కథ చదివాక, వాడి అమాయకత్వానికి అదోలా చూస్తూ ఫక్కున నవ్వాను. మళ్లీ మళ్లీ... కన్నీళ్ల పర్యంతం నవ్వాను.

'నవ్వడం నీ హక్కు, నీ యిష్టం, నవ్వుకో' అన్నట్టు వాడు నిర్మోహంతో, నిశ్శబ్దంగా నిలుచున్నాడు.

"ఇది.. ఇది కథట్రా?.. ఇదట్రా కథ?... ఇదేం

## గజల్

మనుషులందరు ఒక్కమాదిరి ఉండరుగ
విందులలో ఒక్క కూరనే వండరుగ

జన్మనిచ్చే అమ్మ నాన్న లొక్కరే అయిన
జన్మించెడి బిడ్డలందరు ఒక్కలాగుండరుగ

నమ్మెడి దైవంలో శక్తి ఒకటే అయిన
దేవతలందరు ఒక్క రూపున ఉండరుగ

పొట్టకూటికే అందరి శ్రమ అయిన
వృత్తుల ఎంపికలో ఒక్క మార్గాన ఉండరుగ

ఎవరైన పాలించేది ప్రజలనే అయిన
సిద్ధాంతాల్లో పాలకులందరు
ఒక్కలాగుండరుగ

ఈ లోకం తీరే వేరురా పృథ్వి
లోకకంతకులను శిక్షించేవారుండరుగ.

–యస్. ఆర్. పృథ్వి

## ఎన్‌సైక్లోపీడియా...

మట్టంటే వొట్టి ఇసకా ధూళీనా?
కాదు కాదు... కానే కాదు...
ఈ ప్రాణ కోటి సంతతినీ తన ఒడిలో
దాచుకుని
అన్న పానాదులనిచ్చే అమ్మ గర్భం...
పిసరంత ఎత్తుతో తన సారాన్ని ధారపోసి
మొక్కలను చేస్తుంది వృక్షాలుగా మారుస్తుంది
నాగలితో చీల్చినా
గుండెల మీద పడుకుని కాలుతో తన్నే
పసిబిడ్డలా
రైతు బిడ్డని చూసి మురిసిపోతుంది
పంట చేలనందించి కడుపునింపే కమ్మని
బువ్వనిస్తుంది
అమ్మ తన కడుపులో సుఖదుఃఖాలను
దాచుకుని
బిడ్డల నూరడించినట్టు
తరులనూ గిరులనూ తటాకాలనూ
సముద్రాలనూ
గుండెలో దాచుకుని భారాన్ని మోస్తూ
భూమిపుత్రులకు ఫలాలనందించాలని
చూస్తుంది.
కాళ్లతో పిసికి తన్నిన కుమ్మరిని
తన బాధంతా మరిచిపోయి
అతను ధరింపజేసే ఏ ఆకృతినైనా
గిన్నెగా గ్లాసుగా తొట్టెగా కుండగా
ఏదైనా సరే స్వీకరిస్తుంది అతని
ప్రతిభను చూసి పొంగిపోతుంది
ఒక్క చినుకు పడగానే పులకరించిపోతుంది
తన ప్రేమను దిశదిశలా పంచిపెడుతుంది
కమ్మని మట్టివాసనకి ఏ పరిమళమైనా
సరితూగుతుందా?
అందుకే అంటాను – 'మట్టంటే అమ్మే...
మట్టంటే మహాకావ్యం...! ఎందరో
పుణ్యపురుషుల పుణ్యవతుల చరితను
ఇముడ్చుకున్న 'ఎన్‌సైక్లోపీడియా'
మట్టంటే మహాసాధ్వి మైథిలిని కన్న గర్భం!'
అని!

**–శారదా అశోకవర్ధన్**

కథ?"

"ఓ ప్రేమ కథ!"

"భలే..." వస్తున్న నవ్వును ఆపుకోలేదు. నవ్వాను. వాడు రాసిన ప్రేమ కథను మీరు వినండి! వినండి నండి... ఇదో ప్రేమ కథట...

○ ○ ○

చాలా మంది దృష్టిలో జీవితం ఓ రణరంగం. జయం కోసం రక్తాన్ని ధారపోస్తుంటారు. ప్రాణాల్ని బలిపెడుతుంటారు. బలి తీసుకొంటారు. తమ యిష్టాలకు ఎదుటివారిని ఒప్పించడానికి కత్తులు సానబడుతుంటారు. 'మనోహర్' లాటివాళ్లు దాన్ని ప్రేమంటారు. ఎలా నమ్మడం?...

ప్రేమ గణగణమ్రోగే కంచులా కాక, 'కనకం'లా భాసిల్లాలి. ప్రేమ సంపన్నత బహుముఖమైనది. దాని సార్థకత మన సహృదయ సంపన్నతను బట్టి ఉంటుంది. పరస్పర విశ్వాసం మరో మెట్టు. మాటల మూటలెన్ని విప్పినా, అవి మనలోని మత్సరాన్నీ, డాంబికాన్నీ ప్రదర్శిస్తాయే తప్ప దయార్ద్రతా, సశ్శీలతకు ఆలంబనగా కన్పించవు సుమా! కార్యాచరణే దాని ఆయువుపట్టు!

సిసలైన ప్రేమ నమ్మకంపై నడుస్తుంది. నిరీక్షణలో ఫలిస్తుంది. ఓర్పులో ఆనందిస్తూంది. కాని 'మనోహర్'...

○ ○ ○

ఈ సంవిధానంలో సాగిన బాచిగాడి రచనా విన్యాసాన్ని చూసి నవ్వుకోక.., మరోలా... ఎలా?...

"తలా తోకా లేదు, ఇదేం ప్రేమకథ?" అని మీరనుకున్నట్టే నేనూ అనుకోవడంతో – సరిపెట్టుకోక, వాడి తలపై ఓ మొట్టికాయ నంటించి, అదే అన్నాను.

బాచి బెదురు చూపులేం చూడలేదు, తల గోక్కుంటూ, నెమ్మది స్వరంతో– "ప్రేమించడమంటే– జీవించడమే కదా!... కాదా?" అన్నాడు.

నా మెదడులోకి విద్యుత్ జొరబడినట్లయింది. వెంటనే జవాబివ్వలేకపోయాను. ఇప్పటికీ...! యువతరం ఆలోచనా విధానం, కార్యాచరణా అందుకనువుగా అన్పించడంలేదు. రక్తసిక్తమౌతున్న మన తరగతి గదులే అందుకు సాక్ష్యం!

ఎప్పటికయినా... బాచిగాడి ప్రశ్నకు జవాబివ్వగలనా? ■